

మెట్లు ఎక్కి దిగి.. నీరసించి..



ఈ కష్టాలు తీరేదెన్నడు..?

ఇట్లయితే ఎట్ల సారూ!

- లిఫ్ట్ లేదు.. మెట్లు ఎక్కలేక అవస్థలు
- రైళ్లు వస్తున్నా.. ట్రాక్ దాటేస్తున్నారు
- అనంత స్టేషన్‌లో అలవిగాని సమస్యలు



లిఫ్ట్ పనిచేసేదెన్నడో..!

ప్లాట్ ఫామ్స్‌లో టాయిలెట్స్ లేవు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 8: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ కనీస సౌకర్యాలు కూడా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కొంచెం ముందుగా వచ్చారంటే అంతే సంగతులు. రెండు, మూడు ప్లాట్‌ఫామ్స్‌లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా అవకాశం లేదు. ఆ రెండు ట్రాక్స్‌పైనే ఎక్కువగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఒకేసారి రెండు మూడు రైళ్లు వస్తే ప్రయాణికులతో ఆ రెండు ప్లాట్‌ఫామ్స్ కిటకిటలాడిపోతాయి. అత్యవసర సమస్య వచ్చిందంటే ఇక్కడ నుంచి వెళ్లడానికి లిఫ్ట్ కూడా లేదు. మెట్లు ఎక్కలేక ప్రయాణికులు అవస్థలు పడుతుంటారు. 'ఇవేమిటి ఇలా ఉన్నాయి. ప్రయాణికులు ఎలా రాకపోకలు సాగిస్తారు..?' అని తనిఖీ సమయంలో మెట్ల గురించి సిబ్బందిని డీఆర్ఎం ప్రశ్నించారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అనారోగ్యంతో బాధపడేవారు, వృద్ధులు ఆ మెట్లను ఎలా ఎక్కుతారో అధికారులకే తెలియాలి.

అన్నీ ఇబ్బందులే..

స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన 1వ రోడ్డు వైపు ఉన్న 1వ ప్లాట్‌ఫామ్ పనులే ఇప్పటికీ పూర్తి కాలేదు. శ్రీనివాసనగర్ వైపు ఉన్న పాత స్టేషన్ భవనం స్థానంలో నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ 1వ ప్లాట్‌ఫామ్‌గా ఉన్న దాన్ని 4వ ప్లాట్‌ఫామ్‌గా మార్చారు. నిర్మాణాల కారణంగా ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరుపయోగంగా ఉంచారు. ఈ ప్లాట్‌ఫామ్ నుంచి రాకపోకలు సాగించాల్సిన రైళ్లన్నింటిని 3వ ప్లాట్‌ఫామ్‌కు మళ్లించారు. అక్కడ కనీస వసతులు లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లడానికే ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ ఉన్న లిఫ్ట్ వినియోగంలోకి రాక, మెట్లు ఎక్కలేక అవస్థలు తప్పడం లేదు. ప్రమాదమని తెలిసినా ప్రత్యామ్నాయం లేక కొందరు ట్రాక్ దాటుతుంటారు.

రైలు వచ్చింది.. ఎక్కేవారు.. దిగేవారు.. ట్రాక్ దాటాల్సిందే..



ఉన్నా లేనట్టే..

స్టేషన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవడానికి ప్రత్యేకంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. కానీ ప్రయోజనం శూన్యం అన్న విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చామా? వెళ్లామా? అన్నట్లు వ్యవహరిస్తున్నారని, ప్లాట్‌ఫామ్స్ శుభ్రత గురించి పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఏమున్నా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే సూపర్‌వైజర్లు చూసుకోవాల్సిందే అంటున్నారు. తనిఖీలకు వచ్చిన డీఆర్ఎం.. మురుగునీటిలో నడవాల్సి వచ్చిందంటే.. పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



రైలు ఎక్కాలంటే.. ముందు ఈ మెట్లు ఎక్కాలి మరి..

కొరవడిన సమన్వయం



ప్లాట్ ఫాంపై రద్దీ..

సాధారణంగా ఏవిభాగంలో అయినా ఓ ఉన్నతాధికారి ఉంటారు. ఆయన ఆదేశాల మేరకు పాలన వ్యవహారాలు అమలు చేస్తారు. అనంతపురం రైల్వే స్టేషన్ సిబ్బంది అందుకు విరుద్ధంగా తయారయారన్న ప్రచారం జరుగుతోంది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సమన్వయంలేని కారణంగా ఎవరికి తోచిన పని వారు చేసుకుంటూ పోతున్నారు. మిగిలిన సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. స్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్ సిబ్బందిలో ఎవరినీ ప్రశ్నించే పరిస్థితుల్లోలేరన్న విమర్శలు ఉన్నాయి. ఆయన కూడా సమయానికి వచ్చామా? తిరిగి వెళ్లామా అన్న విధంగా నడుచుకుంటున్నారు. డీఆర్ఎం తనిఖీల సమయంలోనే ఈ పరిస్థితి కళ్లకు కట్టింది. అధికారులను అడిగితే మౌనమే సమాధానం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.



త్వరగా పదండి.. రైలు వచ్చేలోగా ట్రాక్ దాటండి..



త్వరగా పరిష్కరిస్తాం..

[illegible]

-అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్

పల్లె దారి మారేనా..!

ఐదేళ్ల వైసీపీ పాలనలో ధ్వంసం

- మరమ్మతులకు పైసా ఇవ్వని వైనం
- టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- రూ.172.59 కోట్ల అంచనాలతో నివేదిక



కంకరతేలిన శ్రీరంగాపురం - బూదివర్తి రహదారి

ఇదీ పరిస్థితి

జిల్లావ్యాప్తంగా
దెబ్బతిన్న రహదారులు : 173
దెబ్బతిన్న రోడ్ల పొడవు: 868 కి.మీ.
మరమ్మతులకు ఖర్చు అంచనా:
రూ.172.59 కోట్లు

అనంతపురం సిటీ, ఆగస్టు 8: వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. గ్రామీణ రోడ్ల మరమ్మతులకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. విపక్ష నాయకులు, ప్రజలు ప్రశ్నించినా ఐదేళ్లపాటు పట్టించుకోలేదు. ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఇక రోడ్లు బాగుపడతాయని జనం భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివృద్ధి అంశాలపై కసరత్తు మొదలెట్టారు. గ్రామీణ రోడ్ల పరిస్థితిని తెలుసుకుంటున్నారు. మరమ్మతుల కోసం నివేదికలు అందజేయాలని పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించారు. ఆ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న 173 రోడ్ల మరమ్మతులకు రూ.172.59 కోట్లు అవసరమని అంచనా నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. నిధులు మంజూరు అయితే ప్రజలకు కష్టాలు తీరుతాయి. త్వరలోనే నిధులు వస్తాయని భావిస్తున్నారు.



బెళుగుప్ప మండలం శీర్పి-విరుపాపల్లి రోడ్డు దుస్థితి



ఉరవకొండ-ఇంద్రావతి రోడ్డు

ఇంత అధ్వానమా..?

వైసీపీ ఐదేళ్లలో పాలనలో బటన్ నొక్కుడు తప్ప జనం సమస్యల గురించి పట్టించుకోలేదు. ఫలితంగా గుంతలమయమైన రహదారుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాల బారిన పడ్డారు. వాహనాలు దెబ్బతిని ఆర్థికంగానూ నష్టపోయారు. ప్రధానంగా ఉరవకొండ, గుంతకల్లు, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల పరిధిలో గ్రామీణ రహదారులు అత్యంత అధ్వారంగా మారాయి. అధికారుల నివేదికలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది.

నివేదిక పంపాం..



అసెంబ్లీ సమావేశాలలో గ్రామీణ రోడ్ల మరమ్మతుల విషయమై చర్చ సాగింది. ఈ నేపథ్యంలో రోడ్ల పరిస్థితిని తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదికను అందజేశాం. మరమ్మతులకు తగిన నిధులను కేటాయించాలని కోరాము.

- కేవీ ప్రసాద్, పీఆర్ ఎస్ఈ





బొమ్మనహాళ్ నుంచి ఏళాంజి, మైలాపురం వెళ్లే రహదారి ఇలా..

బఫర్ భయం

- వెయ్యి క్వింటాళ్లకుపైగా తేలని లెక్క
- వైసీపీ పాలనలో రేషన్ బియ్యం పక్కదారి
- అప్పట్లో అధికారులు, వైసీపీ డీలర్లు కుమ్మక్కు
- పాత్రధారులు, సూత్రధారుల్లో గుబులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 8: రేషన్ షాపుల్లో బఫర్ బియ్యం వ్యవహారం కొలిక్కిరాలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ షాపులు నిర్వహించిన ఆ పార్టీ నాయకులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారు. అప్పటి అధికారులు వారికి సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో తాత్కాలిక డీలర్ల మార్పు జరుగుతోంది. రేషన్ షాపుల నిర్వహణ కూటమి నాయకుల ఆధీనం అవుతోంది. దీంతో బియ్యం బొక్కుడు వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఆందోళన చెందుతున్నారు. బయోమెట్రిక్ ద్వారా నిత్యావసరాల పంపిణీ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతినెలా పంపిణీ తరువాత డీలర్ల వద్ద మిగిలి ఉన్న నిత్యావసరాలను కలిపి తదుపరి నెల సరుకుల అలాట్‌మెంట్ చేస్తారు. పాత డీలర్లు తమకు రావాల్సిన కమీషన్ జమ చేసుకున్నప్పటికీ... ఇంకా ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. తాము 2019లో బాధ్యతలు తీసుకున్నపుడు తమకు ఇలాగే బఫర్ ఇచ్చారని పాతవారు వాదనకు దిగుతున్నారు.



కంబదూరులోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్

వెయ్యి క్వింటాళ్లకుపైగా బఫర్

కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో వెయ్యి క్వింటాళ్లకు పైగా బఫర్ ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఆ మండలాల పరిధిలో నలుగురే రెగ్యులర్ డీలర్లు. మిగిలిన వారు ఇన్‌చార్జులు, బినామీలే. చాలా మంది పరిధిలో క్వింటం నుంచి 30 క్వింటాళ్లకు పైగా బఫర్ ఉన్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక డీలర్ల మార్పు ప్రారంభం కావడంతో బఫర్ సర్దుబాటుకు అధికారులు అగచాట్లు పడుతున్నారు. నెలన్నర నుంచి పోరాడుతున్నా బఫర్ సమస్య కొలిక్కి రాకపోవడంతో సివిల్ సప్లై అధికారులు, నూతన డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బఫర్ లేకుండా తమకు స్టోర్‌లు అప్పగించాలని కొత్తవారు అధికారులను కోరుతున్నారు. మీరే మాట్లాడుకోండని కొత్తవారికి అధికారులు సలహా ఇస్తున్నట్లు సమాచారం.

బిగుస్తున్న ఉచ్చు

బఫర్ బియ్యం బొక్కుడు వ్యవహారం ఇప్పుడు తమ మెడకు చుట్టుకుంటోందని అందులో ప్రమేయం ఉన్న రెవెన్యూ స్టాక్ పాయింట్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ పాలనలో అధికారులు, డీలర్లు కుమ్మక్కై కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలలో ప్రమేయం ఉన్న అధికారుల వివరాలను ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పాత డీలర్లపై ఎక్కువగా ఒత్తిడి పెడితే తమ పేర్లు బయటకు పెడతారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బఫర్ బియ్యం లెక్కలను ఎలా తేలుస్తారోనన్నది వేచి చూడాలి.

బఫర్ బియ్యాన్ని అమ్మేశారు...

రాబోయేది వైసీపీ ప్రభుత్వమే అన్న ధీమాతో అప్పట్లో కొందరు డీలర్లు బఫర్ బియ్యాన్ని అమ్మేశారు. కొందరి వద్ద మాత్రం నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మరికొందరు బియ్యాన్ని అమ్మి జొన్నలు, రాగులను ఎక్కువగా చూపారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉంది. ఎక్కువగా ఇక్కడి నుంచే ఆ రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది. కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న కేసులు ఈ మండలాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. బఫర్ ఉన్న డీలర్లపై 6ఏ కేసులు పెట్టాలా లేక క్రిమినల్ చర్యలు తీసుకోవాలా అంటూ రెవెన్యూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఓ మాదిరి వాన

అనంతపురం అర్బన్, ఆగస్టు 8: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. అనంతపురం, బెళుగుప్ప, పుట్లూరు, యల్లనూరు, ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో మోస్తరు వర్షం పడింది. యాడికి, బొమ్మనహాళ్, పుట్లూరు, గార్లదిన్నె, గుత్తి తదితర మండలాల్లో జల్లులు పడ్డాయి. జిల్లాలోని 14 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా గార్లదిన్నెలో 8.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 6.4, శింగనమల 6.0, కళ్యాణదుర్గం, యల్లనూరు 5.4, ఆత్మకూరు 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగితా ప్రాంతాల్లో 4.2 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.







అనంత: వానలో వాహనదారులు



రింగ్‌రోడ్డు నిర్మించండి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



పార్లమెంటు సమావేశాల్లో రింగ్‌రోడ్డు గురించి మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలని కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం రింగ్‌రోడ్డు గురించి ఎంపీ ప్రస్తావించారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో జనాభా నానాటికీ పెరిగిపోతోందనీ, ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. రింగ్‌రోడ్డు నిర్మాణమే ఈ సమస్యకు పరిష్కారమని అన్నారు. అనంతపురం-బుక్కరాయసముద్రం చెరువు, దేవరకొండ వంటి భౌగోళిక పరిమితుల కారణంగా పడమర దిశగా నగరం విస్తరిస్తోందని తెలిపారు. తద్వారా జాతీయ రహదారి-44 బైపాస్ కుడి, ఎడమ వైపు పరిశ్రమలు, వాణిజ్య, వసతి గృహాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా బైపాస్ రోడ్డు స్థానిక రహదారిగా మారిందని అన్నారు. రద్దీ కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వంతెనల నిర్మాణం జరిగినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. దీంతో రింగ్ రోడ్డు గురించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎంపీకి మంత్రి హామీ ఇచ్చారు.



నగరంలోని పొట్టి శ్రీరాములు స్కూల్‌లో సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో సందడి

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- 971 కమిటీలు ఏకగ్రీవం
- కోరం లేక 29 చోట్ల వాయిదా

అనంతపురం విద్య, ఆగస్టు 8: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జిల్లావ్యాప్తంగా గురువారం సజావుగా సాగాయి. మొత్తం 1,741 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లుచేశారు. ఇందులో కోరం లేని కారణంగా 29 చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. 971 స్కూళ్లలో కమిటీలు ఏకగ్రీవం అయ్యాయి. 741 పాఠశాలల్లో ఎన్నికల ద్వారా కమిటీలను ఏర్పాటు చేశారు. వాయిదా పడిన చోట్ల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఏపీసీ నాగరాజు తెలిపారు. ఎన్నికల పాఠశాలల ఆవరణలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, పోలీసులతో ఉదయం నుంచి కిటకిటలాడాయి. అంతటా ఎన్నికల సందడి కనిపించింది. గతంలో భారీగా దాడులు, ప్రతిదాడులు జరిగాయి. వైసీపీ నాయకులు, ఆ పార్టీ శ్రేణులు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయాలని ప్రయత్నించారు. గత అనుభవాల నేపథ్యంలో కలెక్టర్, సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, ఇతర అధికారులు బుక్కరాయసముద్రం జడ్పీ హైస్కూల్, గార్లదిన్నె కేజీబీవీ స్కూల్‌తో పాటు ఇతర స్కూళ్లను సందర్శించి ఎన్నికల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

ఎంవీ రమణకు తుది వీడ్కోలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, శ్రేణుల నివాళి
- కదిలొచ్చిన కమ్యూనిస్టు భావజాల ప్రియులు
- పార్టీలకు అతీతంగా ఘననివాళి
- వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత

అనంతపురం విద్య, ఆగస్టు 8: సీనియర్ సీపీఐ నాయకుడు ఎంవీ రమణకు ఆత్మీయులు, కుటుంబసభ్యులు, సీపీఐ, సీపీఎం శ్రేణులు, కమ్యూనిస్టు భావజాల ప్రియులు, పలు పార్టీల నాయకులు ఘనంగా తుది వీడ్కోలు పలికారు. ఆయన అంతిమ యాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంవీ రమణ భౌతికకాయాన్ని ఉదయం ఇంటి నుంచి పార్టీ ఆఫీస్‌కు తీసుకొచ్చి వామపక్ష పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీశ్రేణులతో కలిసి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం నాయకులు ఓబులతో పాటు ఇతర పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, వైసీపీ నాయకులు, సీపీఎంఎల్, ఎస్‌యూసీఐ, సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ, కడప, నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన పలువురు నాయకులు తరలి వచ్చి నివాళులర్పించారు. ఆయనతో సాన్నిహిత్యం ఉన్న మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు, సామాన్యప్రజలు సైతం తరలివచ్చిన నివాళులర్పించారు.

వైద్య కళాశాల వరకూ అంతిమయాత్ర...



అనంతపురంలో సాగుతున్న ఎంవీ రమణ అంతిమయాత్ర



భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలైన ఎంవీ రమణ అంతిమయాత్రను 3.30 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల వరకూ నిర్వహించారు. పార్టీ ఆఫీస్ నుంచి త్రివేణి థియేటర్ సర్కిల్, సూర్యనగర్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ మీదుగా వైద్య కళాశాల వరకూ అంతిమయాత్ర సాగింది. సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ మధ్యలో వచ్చి అంతిమయాత్రలో భాగస్వాములయ్యాయి. ఎంవీ రమణ కుమారుడు వేణుగోపాల్, కోడలు సునీత, మనవడు, మనవరాళ్ల అంగీకారంతో ఆయన భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావుకు అప్పగించారు.

ఉన్నత విలువలున్న వ్యక్తి ఎంవీ రమణ: రామకృష్ణ

ఉన్నత ఆశయాలు, విలువలతో జీవించిన మహోన్నత వ్యక్తి ఎంవీ రమణ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఎంవీ రమణ భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన తర్వాత పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా విప్లవ వందనాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మరణించే వరకూ ఆయన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సేవ చేశారన్నారు. ఆయన సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని తెలిపారు. జగదీష్ మాట్లాడుతూ సమాజానికి తన జీవితాన్నే అంకితం చేసిన గొప్ప వ్యక్తి రమణ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు రామచంద్రయ్య, నాయకులు కర్నూలు జిల్లా నాయకులు భీమలింగప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నబీరసూల్, రాధాకృష్ణ, కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్రా, కడప నాయకులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెనిన్‌బాబు, ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు నారాయణస్వామి, మల్లికార్జున, సంజీవప్ప, రాజారెడ్డి, రమణయ్య లింగమయ్య, శ్రీరాములు, గోవింద్, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబానికి ఎంతో అనుబంధం: పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్: సీపీఐ సీనియర్ నాయకులు ఎంవీ రమణ మృతి ఉమ్మడి జిల్లా ప్రజలకు తీరని లోటని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మృతి విషయం తెలుసుకున్న శ్రీరామ్ గురువారం అనంతపురంలోని ఎంవీ రమణ ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేదల పక్షాన అనేక పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు రమణ అని కొనియాడారు. వ్యక్తిగతంగా ఆయనతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని శ్రీరామ్ అన్నారు. తన తాత పరిటాల శ్రీరాములు, నాన్న పరిటాల రవీంద్రతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు.

రమణ మృతి సీపీఐకి తీరని లోటు: బీకే పార్థసారథి, ఎంపీ

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు ఎంవీ రమణ మృతి ఆ పార్టీకి తీరనిలోటని ఎంపీ బీకే పార్థసారథి గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఎన్నో ప్రజా పోరాటలలో రమణ భాగస్వామి అయ్యాడన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో పార్టీ ఉన్నతికి కృషి చేశారన్నారు. ఆయన మృతి అనంతపురం జిల్లా కమ్యూనిస్ట్ పార్టీకి తీరనిలోటన్నారు.



ఎంవీ రమణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

విద్యతోనే సమాజాభివృద్ధి: వీసీ

సెంట్రల్ యూనివర్సిటీ నూతన భవనాలు ప్రారంభం



సెంట్రల్ యూనివర్సిటీ నూతన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి, ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 8: 'ఆధునిక సమాజాభివృద్ధికి మూలం విద్య. అన్ని వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్య అందినప్పుడే సమాజం సమగ్రాభివృద్ధి చెందుతుంది' అని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.ఎ. కోరి అన్నారు. మండల పరిధిలోని జంతులూరు గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన విద్యా భవనాలు, సంక్షేమ వసతి గృహాలను గురువారం వీసీ, ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రాష్ట్రానికి విద్యారంగంలో మూలమైన సెంట్రల్ యూనివర్సిటీని అత్యున్నతంగా తీర్చిదిద్దటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిదన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తొలి విడతలో రూ.350 కోట్లతో రెండు అకడామిక్ భవనాలు, పరిపాలన భవనం, మూడు విద్యార్థుల హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో విద్యార్థులకు సరిపడ భవనాలు లేకపోవడంతో జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఇంక్యుబేషన్ భవనం, ఓ ప్రైవేటు కళాశాలలో గడిచిన ఆరేళ్ల తరగతులు నిర్వహించామన్నారు. నూతన భవనాలలో ఈ నెల 12 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నూతనంగా మరిన్ని కోర్సులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది నుంచి 1100 మంది విద్యార్థులకు సరిపడే కోర్సులకు అడ్మిషన్ చేసుకుంటామన్నారు. సెకండ్ ఫేజ్‌లో వచ్చే నిధులతో క్యాంపస్ ప్రాంగణంలో సెంట్రల్ లైబ్రరీ, సిబ్బంది క్వార్టర్స్, క్రీడా మైదానంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు విజన్‌తోనే: బండారు శ్రావణి, ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తోనే నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. కేంద్రంతో పట్టుబట్టి అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణానికి కృషి చేశారన్నారు. దాదాపు 500 ఎకరాలలో 17 రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థులు ఈ యూనివర్సిటీలో చదువుకునే విధంగా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టిందని మండిపడ్డారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం శింగనమల నియోజకవర్గంలో ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. క్యాంపస్ అభివృద్ధి విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. యూనివర్సిటీలో తమ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వీసీని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ సిబ్బంది, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎంపీపీ సునీత, టీడీపీ నేతలు పొడరాళ్ల రవీంద్రా, జీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు ఒకరే.. డిప్యూటీకి మాత్రం ఇద్దరు!

డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లో ఇద్దరు సీసీలపై విమర్శలు



డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లో... సీసీ కుర్చీలో సంబంధం లేని క్లర్క్

అనంతపురం విద్య, ఆగస్టు 8: అనంతపురం జిల్లా డిప్యూటీ డీఈఓ ఆఫీస్ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. డిప్యూటీ డీఈఓ ఇద్దరు ఉద్యోగులను సీసీలుగా నియమించుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డీఈఓకు ఒక సీసీ ఉంటే...డిప్యూటీకి మాత్రం ఇద్దరు ఎందుకంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో సీసీగా ప్రస్తుతం మంజీర అనే మహిళా ఉద్యోగి పనిచేస్తున్నారు. అయితే కళ్యాణదుర్గంలోని ఓ హైస్కూల్‌లో పనిచేస్తున్న మస్తాన్‌తో అనంతపురం డిప్యూటీ డీఈఓ కార్యాలయం క్యాంపులో సైతం పనులు చేయిస్తున్నట్టు సమాచారం. క్యాంపుక్లర్కు కూర్చోవాల్సిన సీట్‌లో మస్తాన్ కూర్చొని విధులు నిర్వరిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. డివిజన్‌లోని వందలాది ప్రైవేట్ స్కూళ్ల, ప్రభుత్వ స్కూళ్ల నుంచి డివిజన్ క్యాంపు కార్యాలయానికి వచ్చే కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు సీసీ ఎవరో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఒకే కార్యాలయంలో ఇద్దరు సీసీలు ఉండటం ఇదెక్కడి విడ్డూరం అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జీడిపల్లికి చేరిన కృష్ణమ్మ



హంద్రీనీవా కాలువలో తరలివస్తున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, ఆగస్టు 8: నీటి కోసం అల్లాడుతున్న కరువు జిల్లాకు ఈ ఏడాది 15 రోజులు ముందుగానే కృష్ణమ్మ తరలివచ్చింది. జీడిపల్లి రిజర్వాయరుకు గురువారం కృష్ణా జలాలు వచ్చాయి. గత ఏడాది ఆగస్టు 24న రాగా ఈఏడాది కాస్త ముందుగానే కృష్ణా జలాలు వచ్చి చేరాయి. రాగులపాడు ఎత్తిపోతల పథకం కింద రెండు పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు. హంద్రీనీవా అధికారులు, రైతులు కృష్ణమ్మకు స్వాగతం పలికారు.

ఏంటి ఇదంతా..?

సాయిరత్న ఆస్పత్రి వ్యవహారంపై కలెక్టరు ఆగ్రహం

బాధితుడికి రూ.80 వేలు ఇప్పించండి

వైద్యాధికారుల సమీక్షలో కలెక్టరు వినోద్ కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 8: ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ సక్రమంగా చేయలేదని వచ్చిన ఫిర్యాదుపై కలెక్టరు వినోద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడికి ఆస్పత్రి యాజమాన్యం నుంచి రూ.80 వేలు ఇప్పించాలని, అతడు కోలుకునే వరకు అదే ఆస్పత్రిలో ఉచితంగా ఫిజియోథెరపీ చేయించాలని ఆదేశించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చిదంబరయ్య చేతికి నగరంలోని సాయినగర్‌లో ఉన్న సాయిరత్న ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించారు. ఆరోగ్యశ్రీద్వారా ఆస్పత్రి వారు డబ్బులు పొందారు. అయితే ఆపరేషన్ సక్రమంగా చేయకపోవడం వల్ల రాడ్ బయటకు వచ్చి మరింత ఇబ్బంది పడుతున్నామని బాధితులు చిదంబరయ్య, అతడి భార్య వరలక్ష్మి కలెక్టరు, ఆరోగ్యశ్రీ, వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కమిటీ సమీక్షలో చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీకి సంబంధించి సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 08554- 247266 ఫోన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈసెంటర్ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంచాలని, వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసుకొని, విచారణచేసి, పరిష్కరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద లబ్ధిదారులను నమోదు చేయాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, ఆగస్టు 8: కొత్త క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) జిల్లా కమిటీ గురువారం జిల్లా కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరామసప్ప, సతీష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేస్తోందన్నారు. కొత్త చట్టాలపై న్యాయవాదులు, ప్రజలు, మేధావులతోనూ, పార్లమెంటు లోనూ చర్చలు జరపలేదన్నారు. పార్లమెంటులో బిల్లును ఆమోదించే సమయంలో ప్రతిపక్షాలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. ఇవి పౌర హక్కులు, వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ లేని చట్టాలన్నారు. పోలీసులకు ఎక్కువ అధికారాలు ఇచ్చారన్నారు. రిమాండ్ కాలం 15రోజులు లోపు పోలీస్ కస్టడీకి అడిగే విధానాన్ని 60 నుంచి 90 రోజులకు పెంచారన్నారు. కొత్త చట్టాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూర్యచంద్ర, ప్రకాష్, పురుషోత్తం, నాగరాజు, సురేష్, అశోక్‌నాయక్, ధర్మేంద్ర, చంద్రశేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 506 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

947 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 8: జిల్లాకు 947 మెట్రిక్ టన్నుల ఎరువులు గురువారం సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి పేర్కొన్నారు. ఇందులో యూరియా 338 మెట్రిక్ టన్నులు, డీఏపీ 379, 20-20-0-13 రకం ఎరువులు 230 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయ్యాయన్నారు.

డీఎస్పీల బదిలీ



అనంతపురం క్రైం, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కళ్యాణదుర్గం డీఎస్పీగా ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న పి.రవిబాబును నియమించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం డీఎస్పీగా గుంటూరు వెస్ట్‌లో పనిచేస్తున్న కేవీ మహేష్‌ను నియమించారు.

పీడీఎస్ బియ్యంతో పట్టుబడేవారిపై పీడీ యాక్ట్

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య



అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 8: పీడీఎస్ బియ్యంతో పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య హెచ్చరించారు. గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో పీడీఎస్ బియ్యం దుర్వినియోగానికి సంబంధించి పలు విషయాలను ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.45 కొని సూక్ష్మ పోషకాలు ఇమిడి ఉన్న బియ్యాన్ని పేద వారికి చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తోందన్నారు. అయితే చాలా మంది రేషన్‌కార్డుదారులు ఆ బియ్యాన్ని కిలో రూ.10కు అమ్ముకుంటూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్నారు. పీడీఎస్ బియ్యం క్రయ,విక్రయాలపై నిఘా పెట్టి దాడులు చేస్తామన్నారు. గత ఏడాది నవంబరులో జిల్లాలోని తాడిపత్రితో పాటు పలు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం గోడౌన్‌ల తనికీల్లో భాగంగా జరిగిన అక్రమాలకు సంబంధించి రూ.ఐదు కోట్లు జరిమానా విధించినట్లు వెల్లడించారు.

నేడు పీసీసీఎఫ్ రాక

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు8: ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రానికి గురువారం రాత్రికి చేరుకుని బస చేయనున్నారు. ఉదయం 7 గంటలకు జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేయనున్నారు. అనంతరం వడ్డుపల్లి బీట్‌లోని పంపనూరు నగరవనంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరు కానున్నారు. తర్వాత కళ్యాణదుర్గం, రాయదుర్గంలలో ఏర్పాటు చేయనున్న నగరవనాలను పరిశీలించనున్నారు.

తుంగభద్రకు తగ్గిన వరద

బొమ్మనహాళ్, ఆగస్టు 8: తుంగభద్ర జలాశయానికి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టింది. గురువారం సాయంత్రానికి 48,239 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక్క అడుగు మేర 5 క్రస్ట్ గేట్లు ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 12,545 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గురువారం సాయంత్రం నాటికి 1632.53 అడుగులతో 103.900 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దులోని 105వ కి.మీ. వద్ద 1410 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

సీటెలా 'గురూ'..!

గురుకుల విద్యాలయాల్లో సీట్లు పెంచితేనే పేద విద్యార్థులందరికీ న్యాయం జరుగుతుందని వారి తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. సాధారణంగా గురుకుల పాఠశాలల్లో చక్కని బోధన, మంచి భోజనం, వసతి ఉండటంతో తమ పిల్లలను ఇక్కడ చేర్చడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల్లో సీట్లు ఉంటే దరఖాస్తులు వేలల్లో వస్తున్నాయి. ప్రతిభ ఆధారంగానే సీట్ల భర్తీ చేస్తున్నప్పటికీ మరికొందరు ప్రతిభావంతులకు నిరాశ తప్పడం లేదు. ఈక్రమంలోనే సీటు కోసం సిఫార్సులు సైతం వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఆయా పాఠశాల స్థాయిని బట్టి సీట్ల సంఖ్యను పెంచాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

- అనంతపురం ప్రెస్‌క్లబ్

సీట్లు వందల్లో... దరఖాస్తులు వేలల్లో..

ప్రతిభ గల విద్యార్థులకు తప్పని నిరాశ

స్కూళ్లను పెంచితేనే సమస్యకు పరిష్కారం

తక్కువ సీట్లు... ఎక్కువ దరఖాస్తులు

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి తీవ్ర పోటీ



నార్పలలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల

ఈ ఏడాది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి వందల సంఖ్యలో ఖాళీలు ఏర్పడితే రూ.20వేలకు పైగా దరఖాస్తు లు వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 15 మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల(బీసీ రెసిడెన్షియల్స్) పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది 960 సీట్లు ఖాళీలున్నాయి. అధికారులు ఈ సీట్ల కోసం 15 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మెరిట్ ఆధారంగా 960 సీట్లను భర్తీ చేశారు. దాదాపు ఏడు వేల మందికి పైగా మెరిట్ విద్యార్థులకు నిరాశే మిగిలింది. అంబేడ్కర్ గురుకులా(ఎస్సీ రెసిడెన్షియల్స్)ల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది 1200 సీట్లు ఖాళీలుండగా...10,600 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఇందులో దాదాపు ఐదు వేల మందికిపైగా మెరిట్ విద్యార్థులు ఉన్నట్లు సమాచా రం. వీరందరికి సీటు దక్కలేదు. గిరిజన గురుకులా(ఎస్టీ రెసిడెన్షియల్స్)ల్లో 801 సీట్లు ఖాళీ ఉండగా దాదాపు 2 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఇక్కడ కూడా 1000 మందికిపైగా విద్యార్థులు సీట్లు పొందలేని దుస్థితి. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ జిల్లాలో ఒక్కటే ఉంది. ఇందులో ఈ ఏడాది 80 సీట్లు ఖాళీలుండగా... 570 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది వేల సంఖ్యలో విద్యార్థులు గురుకులాల్లో సీట్లు దక్కక ఇబ్బంది పడుతున్నారు.

సీఎం దృష్టికి సమస్య

జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో నెలకొన్న సీట్ల సమస్య గురించి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. తాజాగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ సమస్యను సీఎంకు వివరించారు. 'ఎక్కడెక్కడ డిమాండ్ ఉందో అక్కడ సీట్లు ఖాళీలుంటే భర్తీ చేయాలని, లోకల్‌గా వేరే కేటగిరీవారున్నా సీట్లను కేటాయించండి. ఎక్కడా సమస్య లేకుండా చూడాలి' అని సీఎం ఆదేశించినట్లు సమాచారం.

స్కూళ్లను పెంచాలి



ప్రతి గురుకుల పాఠశాలకు దాని సామర్థ్యాన్ని బట్టి విద్యార్థులను కేటాయిస్తారు. ప్రతి ఏడాది ఐదో తరగతి ప్రవేశాలకు ప్రతి పాఠశాలలో 40 నుంచి 80 సీట్లు మాత్రమే ఖాళీలుంటున్నాయి. వీటికోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. 80 మం దికి మాత్రమే సీట్లు కేటాయిస్తే... మిగతా విద్యార్థుల పరిస్థితి ఏంటి..? అసలే కరువు జిల్లాలో పేద కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి విద్యార్థులకు గురుకుల పాఠశాల విద్య అందని ద్రాక్షగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు మరో 10 పాఠశాలలను కేటాయిస్తే... ఈ సమస్య తీరుతుంది.

- మధుప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి



ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలోనే ఖాళీలు ఏర్పడుతుండటంతో అనేక మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో అదనంగా బీసీ గురుకులాలు 10, ఎస్సీ గురుకులాలు 07, గిరిజన గురుకులాలు 05, మైనార్టీ 04 చొప్పున పాఠశాలలను ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించాం. తొందరగా జిల్లాలో పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

- మద్దెలచెరువు వెంకీ, అప్సా అధ్యక్షుడు, శ్రీ సత్యసాయి జిల్లా

స్ఫూర్తిదాయకం రామకృష్ణ పరమహంస జీవితం

● కడప రామకృష్ణ మఠం ప్రతినిధులు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న అనుపమానంద మహరాజ్ స్వామి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 8: విశ్వశాంతిని కాంక్షిస్తూ, తన జీవితకాలమంతా భక్తిభావనలు, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడానికి రామకృష్ణ పరమహంస నిరంతరం పరితపించారని, ఆయన జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకమని కడప రామకృష్ణ మఠం ప్రతినిధులు అనుపమానంద మహరాజ్, సన్నివాసానంద మహరాజ్ స్వామీజీ పేర్కొన్నారు. హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవాసమితి ఆశ్రమం 20వ వార్షికోత్సవాన్ని గురువారం రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు శ్రీకృష్ణశశి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి అనుపమానంద మహరాజ్, సన్నివాసానంద మహరాజ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 20 సంవత్సరాలుగా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో అనేక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అనంతరం రామకృష్ణ పరమహంస, శారదామాత, స్వామివివేకానంద తదితర మహనీయుల చిత్ర పటాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ నృత్యకళానిలయం ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం, రామకృష్ణ కథామృత పఠనం చేశారు. అర్చనానంద మహరాజ్, రామకృష్ణ సేవాసమితి కార్యదర్శి శ్రీధరమూర్తి, వేదాద్రి, ప్రవీణ్‌కుమార్, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, శ్రీనిధి రఘు, లంకా ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీఓల నియామకంపై కలెక్టర్ సీరియస్

● టీఏలకు ఇన్‌చార్జిలపై ఆరా

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8: మండలానికి ఇద్దరు ఏపీఓలను నియమించడం పట్ల కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్ అయ్యారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డ్వామాలో డ్రామా' అనే కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. వెంటనే మండలానికి ఇద్దరు ఏపీఓలు, ఇన్‌చార్జి ఏపీఓలుగా టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)లను నియమించడం పట్ల కలెక్టర్ ఆరా తీస్తున్నారు. మండలానికి ఇద్దరు ఏపీఓలను నియమించడమే నిబంధనలకు విరుద్ధం కాగా, టీఏలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం పట్ల మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఇద్దరు ఏపీఓలను నియమించిన మండలాల్లో ఎలా జీతాలు చెల్లిస్తారని డ్వామా అధికారులను కలెక్టర్ నిలదీసినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో ఉద్యోగుల బదిలీలు, నియామకాలు, జీతాల చెల్లింపుల వివరాలు నివేదిక రూపంలో తనకు అందజేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ఆ ఏపీఓలు మాకొద్దు: ఇటీవల బదిలీ చేసిన ఏపీఓలను చేర్చుకునేందుకు ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏపీడీలు సుముఖత చూపడం లేదు. ఇటీవల మొత్తం 8మంది ఏపీఓలను బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో పుట్లూరు నుంచి బొమ్మనహాల్‌కు భాగ్యలక్ష్మి, ఆత్మకూరు ఏపీఓ పుష్పావతి కళ్యాణదుర్గానికి బదిలీ చేయగా విధుల్లో చేరారు. ఇక మిగిలిన పీడీ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై ఉన్న ఆదినారాయణమ్మ తాడిపత్రికి, రాప్తాడు ఏపీఓ ఓబన్నను డి.హీరేహాల్‌కు, కూడేరు ఏపీఓ సుజాత కంబదూరుకు, గార్లదిన్నె ఏపీఓ మురళీకృష్ణ బెళుగుప్పకు, తాడిపత్రి ఏపీఓ రాజ్యలక్ష్మి బ్రహ్మసముద్రానికి, పామిడి ఏపీఓ విజయభారతి రాయదుర్గానికి బదిలీ చేసినా విధుల్లోకి చేరలేదు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటెయినర్

● ఒకరి దుర్మరణం

పెనుకొండ రూరల్, ఆగస్టు 8 : మండలంలోని కియ పరిశ్రమ ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని కంటెయినర్ ఢీకొన్న ప్రమాదంలో లక్ష్మీనారాయణ(35) అక్కడికక్కడే దుర్మ రణం చెందినట్లు కియా ఎస్ఐ రంగడు తెలిపారు. రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన జూటూరు లక్ష్మీనారాయణ కొన్నేళ్ల నుంచి ధర్మవరంలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతడు గురువారం ఉదయం ధర్మవరం నుంచి పెనుకొండకు పని నిమి త్తం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కియ పరిశ్రమ ఎదురుగా మెయిన్ గేట్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎడమ నుంచి కుడివైపునకు వెళ్లాడు ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. వెనుకే వస్తున్న కంటెయినర్ వాహనం అతడి తలపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య లక్ష్మీ నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. లక్ష్మీనారాయణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

అనంతపురం క్రైం, ఆగస్టు 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నగర శివారులోని ఎస్ఆర్ కాలనీకి చెందిన ఎరుకల రామలింగ (31) 4వ తేదీన బైక్‌లో ఇంటికెళ్తుండగా మరియమ్మ గుడి వద్ద వాహనం బోల్తాపడింది. గాయపడిన రామలింగ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

వధువు..

గార్లదిన్నె: మండలంలోని కనుంపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి (27) అనే వధువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన శ్రీనివాసుల కుమార్తె వైష్ణవిని అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన రాజశేఖర్‌రెడ్డి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. గత నెల పుట్టింటికి వచ్చింది. 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స అస్పత్రికి తరలించారు. బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వైష్ణవిని అత్తంటివారు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండేవారని, దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని భర్త ప్రవీణ్‌కుమార్, మామ రాజశేఖర్‌రెడ్డి, అత్త లలితమ్మతో పాటు మరో నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ, ఆగస్టు 8: జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. డ్వామా సమావేశ మందిరంలో జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు, ఉద్యోగులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వంద రోజుల్లో ఐదు వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. 2014-19 మధ్య పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని అన్నారు. ఇళ్ల నిర్మాణ వేగాన్ని పెంచేలా కాంట్రాక్టర్లు, లబ్ధిదారుల్లో చైతన్యం నింపాలని సూచించారు. ఇకపై ప్రతి సోమవారం సమీక్ష నిర్వహించి, ఇళ్ల పురోగతిపై ఆరా తీస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ శైలజ, డీఈఈలు కృష్ణారావు, శ్రీమన్నారాయణ, విజయభాస్కర్, హనుమప్ప, రంగస్వామి, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు భేష్

అనంతపురం టౌన్: జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్ దక్కడం అమోఘమైన ఘనత అని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. ఇప్పటికే గుంతకల్ ఆర్డీఓ కార్యాలయానికి గుర్తింపు రాగా తాజాగా జిల్లాలోని జిల్లా ప్రణాళిక కార్యాలయం(సీపీఓ), జిల్లా రవాణాశాఖ కార్యాలయం(డీటీసీ)తోపాటు హిందూపురంఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి ఐఎస్ఓ 9001-2015 గుర్తింపు సర్టిఫికెట్ లభించింది. వీటిని గురువారం కలెక్టర్ చేతులు మీదుగా ఆయాకార్యాలయాల జిల్లా అధికారులకు అందజేశారు.



డీఆర్‌డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నాగుల నగరోత్సవం

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అనంత నాగ్ సంగీత కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నాగదేవతల నగరోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో నాగదేవత ఉత్సవమూర్తిని ఊరేగించారు. గొరవయ్యల విన్యాసాలు, కళాకారులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో వివిధ నృత్య శిక్షణాలయాల ఆధ్వర్యంలో కళాకారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో అనంత నాగ్ సంగీత కల్చరల్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కరణం వెంకటప్రసాద్, ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్



రథంలో దర్శనమిస్తున్న నాగదేవత



నగరోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ వేంకటేశ్వరస్వామి నగరోత్సవం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 8: కళ్యాణదుర్గం రోడ్డులోని శివశక్తి దేవాలయంలో నిర్వహిస్తున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి నూతన శిలా బింబ ప్రతిష్ఠ, అష్టబంధన, మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి నగరోత్సవాన్ని నిర్వహించారు. రథంలో వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు ముందు ఓం సంగీత నృత్యశిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం కోలాటమాడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.



నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బీజేపీలో చేరిన పైలా నరసింహయ్య

అనంతపురం అర్బన్/క్రైం, ఆగస్టు 8: వైసీపీకి రాజీనామా చేసిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. గత కొంతకాలంగా వైసీపీ జిల్లా అధ్యక్షునిగా కొత్త వారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. పైలా రాజీనామా, బీజేపీలో చేరికతో మరోసారి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎవరుంటారనేది చర్చనీయాంశంగా మారింది.



బీజేప రాష్ట్ర అధ్యక్షురాలితో పైలానరసింహయ్య

నేడు వాటర్‌వర్క్స్ కార్మికుల నిరసన

అనంతపురం కల్చరల్, ఆగస్టు 8: సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ స్కీమ్‌ల కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కీమ్‌ల ద్వారా 2వేల గ్రామాలకు తాగునీరందిస్తూ ఎన్నో సంవత్సరాలుగా 1300 మంది కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నాయన్నారు. ఈ సంస్థలను నిర్వీర్యం చేసి, రద్దు చేసే కుట్రలో భాగంగా 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్ కమిటీ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. దీనివల్ల సగం మంది కార్మికులు తొలగిపోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే నిరసనలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమ్మార్పీఎస్‌కు కేటాయించిన స్థలాల పరిశీలన

అనంతపురం రూరల్, ఆగస్టు 8: మండలంలోని కురుగుంట గ్రామ సర్వే నంబరు 41లో ఎమ్మార్పీఎస్ నాయకులకు కేటాయించిన స్థలాలను ఆర్డీఓ వసంతబాబు పరిశీలించారు. గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీఆర్ దాస్, ఇతరనాయకులతో కలసి ఆర్డీఓ స్థలాలను పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ నాయకులకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన సబ్‌డివిజన్ ఎందుకు మార్చాల్సి వచ్చింది సర్వేయర్ ప్రతాప్‌రెడ్డిని ఆర్డీఓ ప్రశ్నించారు. అప్పుడు రాజకీయ పరిస్థితులు, అప్పటి అధికారుల ఆదేశాలతోనే మార్పు చేసినట్లు సర్వేయర్ వివరించారు. ఆమేరకు పట్టాలు పొందిన వారికి న్యాయం చేస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు. వీఆర్వో రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరి, శేఖర్, ఓబుళపతి, రాము, రామాంజి, సుంకన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మాధవయ్య

రాప్తాడు, ఆగస్టు 8: ఏపీ వాల్మీకి బోయ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామానికి చెందిన మాధవయ్యను నియమించినట్లు ఆ సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు పరచాలి

● ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 8: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఉపాధ్యాయ భవన్‌లో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఎస్సీ వర్గీకరణను తక్షణం చేస్తామని ప్రకటించారన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం శ్రీశైలం సభలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని తప్పకుండా సామాజిక న్యాయం చేస్తానన్నారు. సుప్రీంకోర్టులో వర్గీకరణ గురించి గెలిచిన మొదటిసారిగా మందకృష్ణ మాదిగ ఈ నెల 13న హైదరాబాదుకు రానున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని మాదిగ ఉద్యోగులు, మేధావులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లప్పగారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు సాకే అమర్నాథ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్, గౌరవ సలహాదారుడు న్యామద్దల నరసింహులు, ఉలవల నాగరాజు, ఆచార్య లక్ష్మయ్య, బండారు నాగేంద్ర, దేవర పుల్లన్న, హనుమంతురావు, కిష్టప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.



చిలుమూరి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

హెచ్చెల్సీని పరిశీలించిన ఎమ్మెల్యే



వర్షంలోనే హెచ్చెల్సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

నార్పల, ఆగస్టు 8: మండలంలోని వెంకటాంపల్లి గ్రామం వద్ద హెచ్చెల్సీ కాలువను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు. ఎమ్మెల్యే రైతులతో కలసి వర్షంలోనే తడుస్తూ కాలువలో దిగి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆయకట్టుకు నీరు అందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. కాలువ మరమ్మతులు చేయకపోవడంతో కంపచెట్లు పెరిగి, బండరాళ్లతో పూడిపోయిందన్నారు. వెంటనే కాలువ మరమ్మతులను చేపట్టాలని హెచ్చెల్సీ అధికారులకు సూచించారు. టీడీపీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, బాబు, జనసేన నాయకులు గంజికుంట రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఎంవీ రమణ మృతికి ఎమ్మెల్యే సంతాపం

అనంతపురం అర్బన్, ఆగస్టు 8: సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ మృతిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేద ప్రజల కోసం రమణ చేసిన పోరాటాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎంవీ రమణ భౌతికకాయానికి టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, లక్ష్మీనరసింహ, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం రూరల్, ఆగస్టు 8: బుక్కరాయసముద్రం 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణ పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్ డివిజన్ ఈఈ రమేష్, టౌన్-2 డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఆమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అనంతపురం నగరం, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, అనంతపురం రూరల్ పరిధిలో విద్యుత్ ఉండదన్నారు.

టీడీపీలోనే మైనార్టీల అభివృద్ధి

శింగనమల, ఆగస్టు 8: టీడీపీలోనే మైనార్టీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో శింగనమలకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు టైలర్ జిలాన్‌తో పాటు మైనార్టీలు వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్యాయం జరిగిందని, టీడీపీలోనే వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

మత్స్యకారులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి: మండలంలోని మత్స్యకారులకు శింగనమలలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు మత్స్యకారులు విన్నవించారు. గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్వగృహం వద్ద మత్స్యకారులు మర్యాదపూర్వకంగా కలసి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. వెంకటనారాయణ, కార్యదర్శి పాపారాయుడు, పాపన్న, నాగవర్ధన్, హరిపాల్గొన్నారు.

మత్తు వాడితే భవిష్యత్తు చిత్తే

● సీనియర్ న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం టౌన్, ఆగస్టు 8: మత్తుబారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మెడికోలకు సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ హితబోధ చేశారు. గురువారం మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం, మహిళల అక్రమ రవాణా, వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ వాడకం తదితర వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్, లోక్ అదాలత్ చైర్మన్ విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాసరావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మానవజీవితం ఎంతో పవిత్రమైనదని, అలాంటి జీవితాన్ని మత్తుకు బానిసలై నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు జూనియర్, సీనియర్ అనే భావన లేకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా, డాక్టర్లు నవీన్, శంకర్, రామస్వామి, రవికుమార్, వైద్యనాథ్, రేణుక, షబానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పరదేశీనాయుడు, మెడికోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్

నారా రోహిత్‌కు మడకశిర ఎమ్మెల్యే కృతజ్ఞతలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 8: సినీ నటుడు నారా రోహిత్‌కు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఎమ్మెల్యే రోహిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమంలో హాజరైనందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాయల్ మురళి, వెంకటప్ప ఉన్నారు.



నారా రోహిత్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సజావుగా పాఠశాల కమిటీ ఎన్నికలు

అనంతపురం రూరల్, ఆగస్టు 8: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల కమిటీ ఎన్నికలు సజావుగా సాగాయి. మండలంలో 9జడ్పీ, అప్పర్ ప్రైమరీ, 44 ప్రాథమిక పాఠశాలున్నాయి. గురువారం సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్, ఉప చైర్మన్లను ఎన్నుకొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను టీడీపీ నాయకులు సన్మానించారు. కురుగుంటలో నారాయణస్వామి, తిరుపాలు, కక్కలపల్లి కాలనీ పంచాయతీలో బోయ భాస్కర్, ప్రకాష్, సూరి, కక్కలపల్లిలో నారాయణస్వామి, శ్రీనివాసులు, బండి శ్రీరాములు, అన్వర్ బాషా, పొన్నూరప్ప పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలో విద్యాకమిటీ ఎన్నికలు చెదరుముదురు సంఘటనలు మినహా ప్రశాతంగా జరిగాయి. 57 పాఠశాలలకు గాను 55 పాఠశాలల్లో టీడీపీ వర్గీయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దరాంపురం గ్రామంలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య పోటీ పడ్డారు. ఈ విషయంలో వాగ్వావాదం చోటు చేసుకుంది. ఎన్నికలలో టీడీపీలోని ఒక వర్గం వారు గెలుపొందారు. వెంకటాపురం పాఠశాలలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య పోటీపడ్డారు. మాజీ సర్పంచ్ పెద్దప్పమీద మరో వర్గం వారు దాడి చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

గార్లదిన్నె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆదర్శ పాఠశాల, కేజీబీవీ విద్యాలయంలో జరిగిన ఎన్నికలను ఏపీ మోడల్ స్కూల్ ఏడీ, సమగ్ర శిక్ష ఏపీసీ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు, మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 45 పాఠశాలలకు గాను 44 పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక చేశారు. కల్లూరు పాఠశాలలో కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌గా బోయ వరలక్ష్మి, వైస్ చైర్మన్‌గా రమేష్, కేజీబీ చైర్మన్‌గా రాజు, వైస్ చైర్‌పర్సన్‌గా రోజా, గార్లదిన్నె చైర్మన్‌గా వెంకటనారాయణ, వైస్ చైర్‌పర్సన్‌గా రేణుక ఎన్నికయ్యారు.

నార్పల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. 48పాఠశాలల్లో ఎంఈఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. 44 పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. నార్పల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో, బండ్లపల్లి జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో చైర్మన్ల ఎంపికకు కోరం లేక వాయిదా వేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కూటమికి చెందిన వారే చైర్మన్, వైస్ చైర్మన్లు ఎంపిక కావడంతో వారికి అభినందనలు తెలిపారు.

ధర్మవరంరూరల్, (కనగానపల్లి): కనగానపల్లి మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ముందుగా కమిటీ సభ్యులును ఎన్నుకుని అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. కనగానపల్లి మోడల్ స్కూల్‌కు చైర్‌పర్సన్‌గా నాగరత్నమ్మ, మామిళ్లపల్లి జడ్పీ పాఠశాల చైర్మన్ మండల శివయ్య ఎన్నికయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఎన్నికలను పర్యవేక్షించారు. వెంకటేష్, యాతంపోతలయ్య, సర్పంచ్ అంకే పరిమిళరామకృష్ణ, బాలయ్య, బట్టా సురేష్‌చౌదరి, నాగభూషణం, రాజాకృష్ణ, చల్లాసోము, శివశంకర్‌రెడ్డి, దేవరాజు, నాగేంద్ర, పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని 48 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓలు నరసింహరాజు శివప్రసాద్ తెలిపారు.గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అన్ని చోట్లా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శింగనమల జడ్పీ పాఠశాల చైర్మన్‌గా సురేష్‌కుమార్, పెరవలి జడ్పీ పాఠశాల చైర్మన్‌గా చాకలి వరదరాజులు, నాగులగుడ్డం పాఠశాల చైర్మన్‌గా రామచంద్ర, గుమ్మేపల్లి పాఠశాల చెర్మన్‌గా శ్రీనివాసులు ఆచారి, సలకంచెరువు జడ్పీ పాఠవాల చైర్మన్‌గా సూర్యనారాయణ, సొదనపల్లి జడ్పీ పాఠశాలలో దాల్‌నాగవేణి, వెస్టునరసాపురం గంగాధర్, నిదనవాడ బాలనల్లప్పతో పాటు అన్ని పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆత్మకూరు: మండలంలోని పాఠశాలల కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 37 పాఠశాలల్లో 6 జ.డ్పీ హైస్కూల్స్ 28 ప్రైమరీ పాఠశాలలు, కేజీబీవీ, రెండు యూపీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో తోపుదుర్తి, వడ్డుపల్లి ప్రైమరీ పాఠశాలల ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ నరిసింహారెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామమైన తోపుదుర్తి హైస్కూల్‌లో చైర్మన్‌గా టీడీపీ మద్దతుదారుడు తలారి రాజన్న, వైస్ చైర్‌పర్సన్‌గా తలారి పద్మావతి ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆత్మకూరు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా బొమ్మయ్య వైస్ చైర్‌పర్సన్‌గా ఆదిలక్ష్మి ఎన్నికయ్యారు. శ్రీనివాసులు శశాంక చౌదరి, వెంకటనారాయణ, రవీంద్రారెడ్డి, కార్తీక్ నందన్, కందుల ఓబులపతి, రామదాసు, అక్కులన్న, బొమ్మయ్య, తిక్కస్వామి, ఆదెప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 49పాఠశాలలు ఉండగా అన్నిచోట్ల ఏకగ్రీవంగా ప్రశాంతంగా ముగిశాయి. పేరూరు బాలుర గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్‌గా దేవాగ్ని సుబ్బిరెడ్డి, కోఆప్షన్ మెంబర్‌గా రామాంజినేయులు, నసనకోట బాలికల గురుకుల పాఠశాల చైర్‌పర్సన్‌గా సుగుణ, వైస్ చైర్మన్‌గా రామలింగమ్మ, కొత్తగేరి ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా మంగాపురం పద్మావతి, మౌనిక, కుంటిమద్ది జడ్పీహెచ్ఎస్ జగన్నాథ్, చంద్రకళ, పోలేపల్లి జడ్పీహెచ్ఎస్ మల్లికార్జున, శ్యామలతో పాటు అన్ని పాఠశాలలో కమిటీలు ఏర్పాడ్డాయి.



కురుగుంట అంబేద్కర్ పాఠశాల కమిటీ సభ్యులుగా ఎన్నికైనవారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



శింగనమల మండలం పెరవలి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వరదరాజుకు సన్మానం చేస్తున్న టీడీపీ నాయకులు



పేరూరు గురుకుల పాఠశాల కమిటీ సభ్యులను సన్మానించిన ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు

సజావుగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

● దాదాపు అన్ని పాఠశాలల కమిటీల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం ● ప్రమాణం చేసిన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 8: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం సజావుగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తానరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొత్తం 93 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయని, వాటిలో 71 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 17 ఉన్నత పాఠశాలలకు ఉన్నాయని చెప్పారు. అన్నింటిలోనూ టీడీపీ మద్దతు దారులే చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమక్షంలో ఎన్నికలు జరిగాయన్నారు. ఒక్క ఐజాపురం ప్రాథమిక పాఠశాలలో కోరం లేక ఎన్నిక జరగలేదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ2 సుబ్బరాయుడు, ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: మండలంలోని 71 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులే కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను పట్టణంలోని అనంతపురం రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో టీడీపీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ దంపతులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

పామిడి: మండలంలో 45 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 3 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. గజరాంపల్లి, జీఏ కొట్టాల, ఖాదర్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. జీఏ కొట్టాల, ఖాదర్‌పేట పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ జయనాయక్ తెలిపారు. మిగిలిన 42 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులే చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

ఉరవకొండ: . ఉరవకొండ మండలంలో 66 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించగా 63పాఠశాలల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు టీడీపీ తరఫున ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అమిద్యాలలో రెండు ప్రాథమిక పాఠశాలల్లో, జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. వజ్రకరూరు మండలంలోని 44 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా 43పాఠశాలలో టీడీపీకి ఏకగ్రీవమయ్యాయి. చిన్నహోతూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చైర్మన్ ఎన్నికపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

విడపనకల్లు: మండలంలోని 35 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. 21 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 7 జిల్లాపరిషత్ ఉన్నత, 1 కేజీబీవీ, 1ఆదర్శ పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలను ఎంఈఓ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

కూడేరు: మండలంలో 37 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 36 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అందులో 35 పాఠశాలలకు టీడీపీ, ఒక పాఠశాలకు జనసేన మద్దతుదారులు చైర్మన్, వైస్‌చైర్మన్లు, సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదిరిపికొండ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మాత్రం ఎన్నిక వాయిదా పడింది.

బెళుగుప్ప: మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీతో పాటు ఏడు ప్రాథమికోన్నత, 30 ప్రాథమిక పాఠశాలల ఎన్నికల్లో టీడీపీ మద్దతు దారులు ఏకగ్రీవంగా గెలిచారు. సమస్యాత్మక గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఎస్ఐ శివ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్‌ఎంసీ నూతన సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు 53 ఉన్నాయి. అందులో 51 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. వాటన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలిచారు. మిగిలిన నిజవల్లి గ్రామంలోని పాఠశాలలో కోరం లేక, మహంతపురం పాఠశాలలో ఘర్షణ జరగడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

కళ్యాణదుర్గం(శెట్టూరు): శెట్టూరు మండలంలో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాల, 40 ప్రాథమిక, నాలుగు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బ్రహ్మసముద్రం: మండలంలో మొత్తం 50 పాఠశాలలకు గాను 40 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ సానుభూతి పరులు ఏకగ్రీవంగా గెలిచారు.



గుత్తిలో ఎస్‌ఎంసీ నూతన చైర్మన్లతో టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ

మిగిలిన పది పాఠశాలల ఎన్నికలు వాయిదా పడినట్లు పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల విద్యాశాఖాధికారి ఓబులపతి తెలిపారు. వాయిదాపడిన వాటిల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలో 24 ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏడు ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక మోడల్ స్కూల్‌లో ఎన్నికలు జరిగాయి. వాటన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కణేకల్లు: మండల వ్యాప్తంగా 35 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 హైస్కూళ్లతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్‌తో కలిపి మొత్తం 52 స్కూళ్లలో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులే చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా కేజీబీవీతో పాటు 11 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, రెండు ఉన్నత పాఠశాలలు, 36 ప్రైమరీ పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుమ్మఘట్ట: మండలంలో 14 ఉన్నత, 26 ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డీ.హీరేహాళ్: మండలంలో 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 35 ప్రైమరీ పాఠశాలలు, నాలుగు అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలిచారు.

యల్లనూరు: మండలంలో 38పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అన్నింటిలోనూ టీడీపీ సానుభూతిపరులే ఎన్నికయ్యారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా 46 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. అందులో రెండు పాఠశాలలు టీడీపీ మద్దతుదారులకు ఏకగ్రీవం అయ్యాయి. ఇక 44 పాఠశాలల్లో ఎన్నికలు జరగ్గా.. వాటిలో కడవకల్లు పాఠశాలలో సీపీఐ మద్దతుదారులు గెలిచారు. ఇక మిగతా 43 పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులే గెలిచారు.

తాడిపత్రి: పట్టణ, మండలంలోని 85 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అందులో 59పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్‌లు ఏకగ్రీవమయ్యారని ఎంఈఓ నాగరాజు తెలిపారు. 26పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. అన్నింటిలోనూ టీడీపీ సానుభూతిపరులే చైర్మన్, వైస్‌చైర్మన్లుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

యాడికి: మండలంలో ప్రాథమిక పాఠశాలలు 35 , ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 8, ఒక ఆదర్శ పాఠశాల, కేజీబీవీలలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అన్ని పాఠశాలలో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలిచారు.

పెద్దవడుగూరు: మండలంలోని 46పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు.

బంగారు ఆభరణాలు అపహరణ

గుత్తి, ఆగస్టు 8: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితురాలు నాగవేణి స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఆత్మకూరు మండలం బీ యాలేరు గ్రామానికి చెందిన నాగవేణి గుంతకల్లులో తమ బంధువులు ఇంటికి వెళ్లేందుకు గుత్తికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. గుత్తి బస్టాండ్‌లో బస్సు దిగి గుంతకల్లుకు వెళ్లేందుకు మరో బస్సు ఎక్కింది. కాగా తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లో ఉన్న నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు కనపడకపోవడంతో చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీలో తాగునీటి సమస్య తీర్చండి

పుట్లూరు, ఆగస్టు 8: మండలకేంద్రంలోని కేజీబీవీలో తాగునీటి సమస్యను తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీడీఓ దస్తగిరికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తాగునీటితో పాటు కాలకృత్యాలకు నీరు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా వచ్చే ఆరకొర నీరు చాలడం లేదన్నారు. అధికారులు స్పందించి ప్రస్తుతానికి నీటిట్యాంకర్ల సంఖ్యను పెంచుతూ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఖనిజ నిక్షేపాల కోసం సర్వే

యాడికి, ఆగస్టు 8: మండలంలో ఖనిజ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ సిబ్బంది సర్వే పనులు చేపట్టారు. యాడికి నుంచి చందన, గుత్తిరోడ్డు తదితర ప్రాంతాల్లో సర్వేపనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సిబ్బంది మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే పనులు చేపట్టినట్లు తెలిపారు. 30నుంచి 35మీటర్ల వరకు బోర్ ద్వారా తవ్వకం చేపట్టి మెటీరియల్ సేకరిస్తున్నట్లు చెప్పారు. వీటిని ఓఎన్‌జీసీ ల్యాబ్‌కు పంపి పెట్రోల్, డీజిల్, కిరోసిన్ లాంటి నిక్షేపాల నిల్వలు ఉన్నాయా లేదో పరిశీలించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎంవీ రమణ మృతి సీపీఐకి తీరని లోటు

యాడికి, ఆగస్టు 8: సీపీఐ సీనియర్ నాయకుడు ఎంవీ రమణ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రవి తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన ఎంవీ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణ పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. విశాఖ ఉక్కుపోరాటంలో ఆయన పాత్ర అభినందనీయమని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబుల రెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్సిడీతో సూక్ష్మ సేద్యం పరికరాల పంపిణీ

బెళుగుప్ప, ఆగస్టు 8: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఏపీఎంఐపీ సుబ్బరాజు, ఎంఏఓ మల్లేష్ డ్రిప్పులు, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీని టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ తోటలు సాగు చేస్తున్న అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీకి చర్యలు తీసుకుందని తెలిపారు. ఐదు ఎకరాల రైతుకు 90 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాయకులు రాధాకృష్ణ, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, విరుపాపల్లి రాధాకృష్ణ, నర్సింహ్ రాము తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దవడుగూరు, ఆగస్టు8: ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే బిందు సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీఓ శ్రీకాంత్ రైతులకు సూచించారు. మండలంలోని దిమ్మగుడి గ్రామంలో గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతుల కోసం సబ్సిడీతో కూడిన డ్రిప్, స్ప్రింక్లర్లను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల విస్తరణాధికారి రామచంద్ర పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలు పరిష్కరించండి

బొమ్మనహాళ్, ఆగస్టు 8: గత వైసీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వేలో జరిగిన భూ వివాదాలన్నింటినీ పరిష్కారం చేయాలని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ వాణి జగన్నాథ్‌రెడ్డి, కన్వీనర్ బలరాంరెడ్డి కోరారు. మండలకేంద్రంలో గురువారం వారు తహసీల్దార్ మునివేలును కలిసి మండల సమస్యలను తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో రీసర్వే చేసి పాసుపుస్తకాలలో విస్తీర్ణం, పేర్లు తప్పులుగా నమోదు చేసిందన్నారు. దీంతో గ్రామాల్లో భూతగాదాలు ఎక్కువయ్యాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశులు, టీడీపీ నాయకులు ఆనందరావు, సత్యనారాయణ బాబు, గోవిందు, ఎస్సీసెల్ అధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గుత్తి, ఆగస్టు 8: విద్యార్థినులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవా సమితి చైర్మన్, ఏడీజే శ్రీహరి సూచించారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం ఆయన న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే మండల న్యాయసేవా సమితికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరిస్తారన్నారు. అనంతరం ఆయన తరగతి గదులు, వసతులను పరిశీలించారు. పాఠశాల ఎస్‌ఓ రుద్రాక్షి, న్యాయవాది గురుగోవర్ధన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 8: విద్యార్థులు కష్టపడి చదవాలని పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు. కళాశాలలో గురువారం బీకాం కంప్యూటర్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసం లేకుండా విద్యార్థులు మెలగాలన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు పరస్పరం సహకారంతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు, పరిపాలన అధికారి చంద్రశేఖర్, అకడమిక్ కో ఆర్డినేటర్ నటరాజ్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ వరప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 8: పట్టణంలోని మున్సిపల్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య గురువారం ప్రకటనలో హెచ్చరించారు. స్థానిక ఆలూరు రోడ్డులో సమ్మర్‌స్టోరేజ్‌ట్యాంక్ నిర్మాణానికి 1986లో 435.20ఎకరాలు మంజూరైందన్నారు. అక్కడ ఎస్‌ఎస్ ట్యాంక్ నిర్మాణం తరువాత భవిష్యత్తులో ఉపయోగార్థం కొంత ఖాళీ స్థలాన్ని వదలారన్నారు. అయితే ఆ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే ఊరుకోమన్నారు. మున్సిపల్ లేఅవుట్ ఓపెన్ స్థలాలను ఆక్రమించుకుంటే క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.



దుండగులు దున్నేసిన పంటను చూపుతున్న బాధిత రైతు

కంది, సజ్జ పంటల తొలగింపు

యాడికి, ఆగస్టు 8: మండలంలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన కంబగిరిస్వామికి చెందిన పొలంలో కంది, సజ్జ పంటలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించిన సంఘటన గురువారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలమేరకు సర్వేనెంబర్ 273-1లో తనకు నాలుగు ఎకరాల పొలం ఉందని తెలిపారు. ఖరీఫ్‌లో కంది, సజ్జ పంటను సాగుచేశానని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు పొలంలో 8సాళ్లలో పంటను తొలగించారన్నారు. దీంతో రూ.10వేల దాకా పంట నష్టపోయానన్నారు. అప్పులు చేసి పంటలు సాగుచేస్తున్నాని, దుండగులు పంటను దున్నేసి నష్టపరచడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

డ్రిప్పు, స్ప్రింక్లర్ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

యాడికి, ఆగస్టు8: 2024-25వ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం సూక్ష్మ సేద్యానికి సంబంధించి (డ్రిప్పు, స్ప్రింక్లర్) మంజూరు కోసం రిజిస్ట్రేషను ప్రారంభించినట్లు ఎంఐఏవో దిలీప్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో బోరుబావుల కలిగి నీటివసతి ఉన్న రైతులు తమ డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పొలానికి సంబంధించిన 1బీ, ఎఫ్‌ఎంబీ స్కెచ్, చెక్కుబంది, సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, బోర్‌వెల్ కరెంట్ బిల్లుతో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 6303291832ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇద్దరి అరెస్టు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 8: పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన పార్వతి(33)పై ప్రియుడు మోహన్ ఇటీవల పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసులో మోహన్‌తో పాటు ఆతడి తమ్ముడు సిద్దేశ్వర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పార్వతి, మోహన్ ఆర్థిక, కుటుంబ సమస్యలతో గత మూడురోజుల క్రితం తీవ్రంగా గొడవపడ్డారు. ఈ క్రమంలో మోహన్‌తో పాటు సిద్దేశ్వర్ పార్వతిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. స్థానికులు గమనించి ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఆమె వద్ద పోలీసులు వాంగ్మూలం తీసుకుని ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత బుధవారం ఆమె మృతి చెందింది. ఈ కేసులో మోహన్‌ను, సిద్దేశ్వర్‌ను గురువారం అరెస్టు చేశామని, వారిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ పేర్కొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్

తాడిపత్రి, ఆగస్టు 8: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కాలువ, ఆయకట్టు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. నార్త్, సౌత్ కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఎక్కడెక్కడ ముళ్లపొదలు ఉన్నాయో గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ కింద వరదకాలువ పనులు 30శాతం మేర పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైనర్ ఇరిగేషన్ కింద 13చెరువులు ఉండగా అవి మొత్తం పూడికతో నిండిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి అధికారులు తెచ్చారు. అవసరమైతే సొంత నిధులు వెచ్చించి అయినా పూడికను తొలగిస్తామని అధికారులకు ఎమ్మెల్యే తెలియజేశారు. సమావేశంలో డీఈలు, అసిస్టెంట్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

పూడికతీత పనుల పరిశీలన

తాడిపత్రి పట్టణంలోని ఓంశాంతినగర్ నుంచి పాతకోట వరకు ఉన్న కాలువలో పేరుకుపోయిన పూడికతీత పనులను ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అసమర్థత వల్ల కాలువలు ఎక్కడికక్కడ పూడికతో నిండిపోయాయన్నారు. దీంతో మురుగునీరు చేరి దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. వేగవంతంగా పనులను పూర్తిచేసి మురుగునీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ తేజ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, విజ్జి, వరదయ్య, రోషన్న, తిరుపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన అవసరం

యాడికి, ఆగస్టు8: రెవెన్యూ చట్టాలపై సిబ్బంది తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని సమావేశ భవనంలో గురువారం ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలతో అనునిత్యం మమేకమై ఉండేశాఖ రెవెన్యూశాఖ అని తెలిపారు. వివిధ సమస్యలు పరిష్కారం కోరుతూ ప్రజలంతా రెవెన్యూ సిబ్బంది వద్దకు వస్తుంటారన్నారు. సమస్యలను నిష్పక్షపాతంగా పరిష్కరించాలంటే సిబ్బంది చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది బాగా కృషిచేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, సివిల్ సప్లై డీటీ సూర్యనారాయణ, రీసర్వే డీటీ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ సుంకన్న, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలన

యాడికిలో కొత్తగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని ఆర్డీఓ పరిశీలించారు. అందుకు సంబంధించిన అనుమతులపై రెవెన్యూ సిబ్బందిని ఆరాతీశారు. దీనిపై నివేదికను తయారుచేసి పంపాలని ఆదేశించారు.

కుందుర్పి తహసీల్దార్‌గా శ్రీనివాసులు

కుందుర్పి, ఆగస్టు 8: కుందుర్పి మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నూతన తహసీల్దార్‌గా ఎస్వీ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

ఏపీ వీబీఎస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్

ఉరవకొండ, ఆగస్టు 8: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) వజ్రకరూరు మండల అధ్యక్షుడిగా కడమలకుంట గ్రామానికి చెందిన ప్రభాకర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ నాయుడు నుంచి ఈ మేరకు గురువారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి, బోయల హక్కుల కోసం తనవంతుగా పోరాడతానన్నారు.

గజరాంపల్లిలో ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా

పామిడి, ఆగస్టు 8: మండలంలోని గజరాంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం వాయిదా పడ్డాయి. ఆ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎంఈఓలు జయనాయక్, సత్యనారాయణ, పరిశీలకులు(డీఈ) శివరాం, ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్ ఏర్పాట్లు చేశారు. అయితే కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు వాయిదా వేయాలని పట్టుబట్టారు. గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభపెడుతున్నాడని వారు ఆరోపించారు. ఎలాగైనా ఎన్నికలు వాయిదా వేయాలని వాదనకు దిగారు. దీంతో చేసేదేమీ లేక ఎంఈఓలు చర్చించుకుని ఓ కొలిక్కి వస్తే ఎన్నికలు నిర్వహిస్తామని సమయం ఇచ్చారు. అయినప్పటికీ కొందరు తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు వాయిదాకే వేయాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలను నాటి టీడీపీ హయాంలో నిర్మిస్తుండగా ఓ వైసీపీ నాయకుడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌ను లోబరుచుకుని నాణ్యత లేకుండా గుత్తి న్యాయస్థానంను ఆశ్రయించాడన్నారు. క్వాలిటీ కమిటీ విచారించి నాణ్యత ఉందని నివేదికను ఇచ్చినప్పటికీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో దాదాపు పదేళ్లుగా భవన నిర్మాణం జరగకుండా ఆగిపోయిందన్నారు. సుమారు పదేళ్లుగా విద్యార్థులు పాఠశాల లేక ఆరుబయట పాఠశాలలోనే ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సారి కూడా ఎస్‌ఎంసీ చైర్మన్‌ను దక్కించుకొని పాఠశాల భవన నిర్మాణం జరుగకుండా కుట్ర పన్నుతున్నారని వారు ఆరోపించారు. దీంతో వారం రోజుల నుంచే ఎస్‌ఎంసీ చైర్మన్ కోసం డబ్బులు ప్రలోభపెట్టి పావులు కదుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు వాయిదా వేయాలని వారు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఎంఈఓ జయనాయక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎన్నికలు తర్వాత నిర్వహిస్తామని తెలిపారు.

వేములపాడు పాఠశాలకు సీలింగ్ విరాళం

యాడికి, ఆగస్టు 8: మండలం వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి కొనుప్పల నాగిరెడ్డి గురువారం రూ.10వేలు విరాళాన్ని అందించారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాల కోసం ఈ మొత్తాన్ని వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ఘర్షణ

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి

కుందుర్పి, ఆగస్టు 8: మండలంలోని మహంతపురం స్కూలు కమిటీ ఎన్నికలలో ఘర్షణ చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో గురువారం టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య పాఠశాల కమిటీ ఎన్నికల విషయంలో మాటామాట పెరిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్త నరసింహమూర్తిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడ్డ నరసింహమూర్తిని కుందుర్పి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కళ్యాణదుర్గానికి తరలించారు. ప్రశాంతంగా గ్రామంలో జరుగుతున్న పాఠశాల కమిటీ ఎన్నికలలో కూడా వైసీపీ నాయకులు దాడులకు తెగబడటం సరికాదని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.



చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

గుత్తి, ఆగస్టు 8: మండలంలోని తురకపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రంగడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రంగడు కుటుంబాన్ని టీడీపీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, కమల దంపతులు గురువారం పరామర్శించి పార్టీ కార్యకర్తలందరినీ ఆదుకుంటామన్నారు. అలాగే వారికి నిత్యావసర సరుకులతో పాటు రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

గేట్స్‌లో రక్తదాన శిబిరం

గుత్తి, ఆగస్టు 8: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సెంట్రల్ బోర్డు ఇండ్ డైరెక్టర్, టాక్స్ అండ్ కస్టమ్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీనాథ్, ఎంటీ రఘునాథరెడ్డి, మానవత రక్తదాతల సంస్థ ప్రతినిధి అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన

తాడిపత్రి, ఆగస్టు 8: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో చేపడుతున్న అండర్‌డ్రైనేజీ పనులను టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున గురువారం పరిశీలించారు. స్థానికులు అండర్ డ్రైనేజీ చాంబర్‌లో చెత్త పేరుకుపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదని ఇటీవల ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. గురువారం సిబ్బంది చాంబర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తీసివేయడాన్ని దగ్గరుండి కౌన్సిలర్ పనులను పర్యవేక్షించారు. ప్రజలు ఎవరూ చెత్తాచెదారాన్ని అండర్‌డ్రైనేజీలోకి వేయరాదని ఆయన కోరారు.

యువకుడి ఆత్మహత్య


యాడికి, ఆగస్టు 8: మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బేతంచెర్ల మండలం మద్దాపురం గ్రామానికి చెందిన యువకుడు మనోహర్ (28) రైల్వేలో కాంట్రాక్ట్ కూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో కొద్దిరోజుల క్రితం పనులను వదిలి స్వగ్రామానికి వెళ్లాడు. మళ్లీ పనులకు వచ్చిన మనోహర్ అనారోగ్య సమస్యను భరించలేక గురువారం రాయలచెరువు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ పేర్కొన్నారు.

బెళుగుప్ప మండలంలో భారీ వర్షం

బెళుగుప్ప, ఆగస్టు 8 : మండలవ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కుంటలు నిండాయి. రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. ఇప్పటికే మండలంలో రైతులు సుమారు ఏడు వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇంకా పది రోజుల వరకు విత్తనాలు విత్తుకోవచ్చని వ్యవసాయాధికారి పృథ్వీ సాగర్ తెలిపారు.



బెళుగుప్పలో కురుస్తున్న వర్షం



ఎర్రగుడి సమీపంలోని పొలంలో నిలిచిన వర్షపు నీరు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఉరవకొండ/ గుంతకల్లు/ తాడిపత్రి/ యాడికి/ కణేకల్లు, ఆగస్టు 8: ఉరవకొండ పట్టణంలో గురువారం నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతియేటా శ్రావణమాసం చవితి రోజున నాగుల చవితి జరుపుకోవడం ఆనవాయితీ. స్థానిక గవిమఠం, మార్కండేయస్వామి, పార్వతి ఆంజనేయస్వామి ఆలయాల్లోని నాగప్రతిమలకు భక్తులు పాలు పోసి పూజలను చేశారు. నాగదేవతలకు ఇష్టమైన పాలు, నువ్వుల పిండి, నైవేద్యంగా ఉంచారు. కొన్ని చోట్ల పుట్టలకు పాలు పోశారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, భవాని చంద్రశేఖర్, రుక్మిణీపాండురంగ స్వామి, మారెమ్మ, పీర్లసాయి ఆలయాల్లో, తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయాల్లో పూజలు చేసి నాగుల పుట్టలకు పాలు పోశారు. ఇక యాడికి, కణేకల్లు మండలాల వ్యాప్తంగా భక్తులు నాగుల చవితి వేడుకలను ఘనంగా జరిపారు.



ఉరవకొండలో నాగప్రతిమలకు పాలు పోస్తున్న మహిళలు



గుంతకల్లులో నాగుల కట్ట వద్ద ..



యాడికిలో పూజలందుకున్న నాగదేవతలు